మినీ కథ

# "మనం మనమే"

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

చంద్రుడిమీదకి మనిషిని మొదటిసారిగా పంపబోయేముందు అమెరికాలోని 'నాసా' సంస్థ వివిధ దేశాలనించి అభ్యర్థులను పిలిపించింది. వాళ్ళని ఇంటర్వ్యూ చేయసాగారు అమెరికా శాస్త్రజ్ఞుడు హేరీ కూపర్.

"మీరు పైకి వెళ్ళి ప్రాణాలతో తిరిగి వస్తే లక్ష డాలర్లిస్తాం. ఓకే?" అడిగాడు హేరీ కూపర్ రష్యా దేశం నించి వచ్చిన ఏస్ట్రోనాట్‌ని.

"రెండు లక్షల డాలర్లు ఇవ్వండి" కోరాడా రష్యన్.

"ఎందుకు?"

"చంద్రమండలంమీదకి వెళ్ళి ప్రాణాలతో తిరిగి వస్తే లక్ష డాలర్లు నాకోసం, మరో లక్ష నా కుటుంబ సభ్యులకోసం ఖర్చు చేస్తాను."

అదే ప్రశ్నని ఫ్రెంచ్ దేశంనించి వచ్చిన ఏస్ట్రోనాట్‌ని అడిగాడు హేరీ కూపర్.

"మూడు లక్షల డాలర్లు ఇవ్వండి" కోరాడా ఫ్రెంచ్ దేశస్థుడు.

"ఎందుకు?" అడిగాడు హేరీ కూపర్ ఆశ్చర్యంగా.

"లక్ష డాలర్లు నాకు, లక్ష డాలర్లు నా కుటుంబానికి, మరో లక్ష నా గర్ల్‌ఫ్రెండ్‌కి" చెప్పాడతను.

"చంద్రమండలంమీదకి వెళ్ళి వస్తే మీకు లక్ష డాలర్లిస్తాం. సరేనా?" అడిగాడు హేరీ కూపర్ భారత దేశంనించి వెళ్ళిన ఏస్ట్రోనాట్‌ని.

"నాలుగు లక్షల డాలర్లు ఇవ్వండి" చెప్పాడా భారతీయుడు.

"ఎందుకు?"

ఈసారి హేరీ కూపర్ ఇంకా ఆశ్చర్యపోయాడు.

"ఏంలేదు. ఓ లక్ష డాలర్లు నాకు, ఓ లక్ష డాలర్లు నా కుటుంబానికి, ఓ లక్ష డాలర్లు నా గర్ల్ ఫ్రెండ్‌కి, మరో లక్ష నన్ను చంద్రమండలంమీదకి పంపడానికి ఎన్నికచేస్తున్న మీకు ఇవ్వడానికి" తాపీగా సమాధానం చెప్పాడా భారతీయుడు. ●